క్లుప్తంగా

హైవే పక్కన దుకాణాలు ఏర్పాటు చేయొద్దు

మున్సిపల్ కమిషనర్ వీరేందర్



హోటల్ బోర్డును తొలగిస్తున్న అధికారులు

కొత్తూరు: జాతీయ రహదారి, అంతర్గత రహదారుల పక్కన రోడ్డుకు ఆనుకుని ఎలాంటి దుకాణాలు ఏర్పాటు చేయొద్దని మున్సిపల్ కమిషనర్ వీరేందర్ తెలిపారు. బుధవారం జాతీయ రహదారి పక్కన ఏర్పాటు చేసిన ఆయా వ్యాపార సముదాయాల బోర్డులు, పాన్ డబ్బాలను జేసీబీలతో తొలగించారు. రహదారుల పక్కన దుకాణాలు ఏర్పాటు చేస్తే ట్రాఫిక్ ఇబ్బందులతో పాటు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. ట్రాఫిక్ పోలీసుల ఫిర్యాదు మేరకు పలు కట్టడాలను తొలగించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐ బాలరాజు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పండుగలు మన సంస్కృతికి ప్రతీకలు

మున్సిపల్ ఛైర్‌పర్సన్ సాత విజయలక్ష్మి



సంబురాల్లో పాల్గొన్న విజయలక్ష్మి

శంకర్‌పల్లి: పండుగలు మన సంస్కృతికి ప్రతీకలని శంకర్‌పల్లి మున్సిపల్ ఛైర్‌పర్సన్ సాత విజయలక్ష్మి పేర్కొన్నారు. బుధవారం శంకర్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు నిర్వహించిన సంక్రాంతి సంబురాల కార్యక్రమంలో పాల్గొన్నారు. విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలను పరిశీలించారు. కట్టెల పొయ్యిపై పాలను పొంగించారు. రంగు రంగుల ముగ్గులు, వివిధ వేషాధారణలో అందరిని ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పండుగలను ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు పతంగులు అందజేశారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి అక్బర్, కౌన్సిలర్ శ్వేతపాండురంగారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉపాధ్యాయులైన వేళ



స్వయం పరిపాలన దినోత్సవంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

కొందుర్గు: మండల కేంద్రంలోని ఆక్స్‌ఫర్డ్ హైస్కూల్‌లో బుధవారం స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఈ సందర్భంగా డీఈఓగా లోకేశ్వరి, ఎంఈఓగా శ్రీకాంత్, హెచ్‌ఎంగా శరణ్ చక్కగా వ్యవహరించారు. అలాగే, 21 మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి పాఠాలు బోధించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ జోసెఫ్, శిరియాళ, శివకుమార్, కృష్ణకుమార్, సంగీత, అశ్విని, నజ్మ పాల్గొన్నారు.

ఠాక్రేకు సన్మానం



మాణిక్‌రావుఠాక్రేను సన్మానిస్తున్న శ్రీనివాస్

షాద్‌నగర్‌టౌన్: రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జిగా బాధ్యతల చేపట్టి తొలిసారిగా రాష్ట్రానికి వచ్చిన మాణిక్‌రావుఠాక్రేకు బుధవారం కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకుడు శ్రీనివాస్ యాదవ్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎయిర్‌పోర్టులో మాణిక్‌రావుఠాక్రేను రేవంత్‌రెడ్డితో కలిసి పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. పార్టీ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానని నాయకులకు వివరించారు.

ఊర్లకు వెళ్లేవారు సమాచారం ఇవ్వండి

పట్టణ సీఐ నవీన్‌కుమార్

షాద్‌నగర్‌రూరల్: సంక్రాంతి పండుగకు సొంత ఊర్లకు వెళ్లేవాళ్లు తప్పనిసరిగా పోలీసులకు సమాచారాన్ని ఇవ్వాలని పట్టణ సీఐ నవీన్‌కుమార్ సూచించారు. బుధవారం పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో సీఐ నవీన్‌కుమార్ మాట్లాడుతూ..పండుగకు ఊళ్లకు వెళ్లే వారు తమ విలువైన బంగారు ఆభరణాలు, నగదును ఇంట్లో పెట్టకుండా బ్యాంక్ లాకర్లలో పెట్టుకోవాలని చెప్పారు. ఊరికి వెళ్తున్న సమాచారం పోలీసులతో పాటుగా ఇంటి పక్క వారికి చెప్పాలన్నారు. ఇంటికి తాళం వేసిన ఇళ్లలో దొంగతనాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. కాలనీల్లో అనుమానిత వ్యక్తులు సంచరించినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

యాసంగి వరికి సన్నద్ధం

వర్షాకాలంలో కురిసిన అధిక వర్షాలకు భూగర్భజలాలు భారీగా పెరగడంతో రైతుల్లో యాసంగి వరిసాగుపై ఆసక్తి పెరిగింది. చెరువులు, కుంటలు పూర్తిగా నిండడంతో బోరుబావుల్లో పుష్కలంగా నీరుంది. దీంతో చాలా మంది రైతులు వరిసాగు చేసేందుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే కొంత మంది నార్లు పోసి కరిగెట్లు చేస్తున్నారు. దీంతో ఈ సారి మండలంలో వరిసాగు విస్తీర్ణం గత ఏడాది కంటే పెరిగే అవకాశం ఉంది.



మొయినాబాద్ మండలం శ్రీరాంనగర్‌లో వరిసాగుకోసం చేసిన కరిగెట్లు

- భూగర్భజలాలు పెరగడంతో సాగుకు సిద్ధం
- గత ఏడాదితో పోలిస్తే విస్తీర్ణం పెరిగే అవకాశం

మొయినాబాద్: మొయినాబాద్ మండలం హైదరాబాద్ నగరానికి చేరువలో ఉండడంతో యాసంగిలో ఇక్కడి రైతులు ఎక్కువగా పూలు, కూరగాయ పంటలు సాగుచేస్తుంటారు.అయితే ఈ సారి అందుకు భిన్నంగా వరిసాగు ఎక్కువగా సాగు చేసే అవకాశం ఉంది. మొన్నటి వర్షాకాలంలో భారీగా వర్షాలు కురవడంతో వాగులు వంకలు, వరదలు మత్తడి పోశాయి. మండలంలోని అన్ని గ్రామాల్లో చెరువులు కుంటలు నిండాయి. మండలానికి ఆనుకుని ఉన్న గండిపేట, హిమాయత్‌సాగర్ జలాశయాలు సైతం నిండాయి. ఈ జలాశయాల్లోకి వరద నీరు తెచ్చే మూసీ, ఈసీ వాగులు ఇంకా జాలువారుతున్నాయి. మండలంలో భూగర్భజలాలు పుష్కలంగా పెరిగాయి. గతంలో ఎండిపోయిన బోర్లు సైతం ఇప్పుడు నిండుగా నీళ్ల పోస్తున్నాయి. దీంతో రైతులంతా వరిసాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు.

పెరగనున్న సాగు విస్తీర్ణం..

ప్రతి సంవత్సరం మండలంలో యాసంగిలో వరి సాగు చాలా తక్కువగా ఉండేది. గత సంవత్సరం ప్రభుత్వమే యాసంగిలో వరిసాగు వద్దని ప్రచారం చేయడంతో చాలా మంది రైతులు వరినాట్లు వేయలేదు. అయితే ఈసారి భూగర్భజలాలు పుష్కలంగా ఉండడంతో పాటు ప్రభుత్వం కూడా నిబంధనలు పెట్టకపోవడంతో చాలా మంది రైతులు వరిసాగుకు ఆసక్తి చూపుతున్నారు. గత ఏడాది మండలం మొత్తంలో 961 ఎకరాల్లోనే వరిసాగు అయ్యింది. యాసంగిలో సాధారణ సాగు విస్తీర్ణం 2 వేల ఎకరాలుగా ఉంది.కానీ, ప్రస్తుతం నార్లు పోసి, కరిగెట్లు చేస్తున్న పరిస్థితిని చూస్తే 3వేల ఎకరాలకు పైగా వరిసాగు అయ్యే అవకాశం కనిపిస్తుంది.



నారుమడిని పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

జోరుగా కరిగెట్లు...

మండలంలో వరి సాగుకోసం ప్రస్తుతం రైతులు కరిగెట్లు జోరుగా చేస్తున్నారు. మండల పరిధిలోని అమ్డాపూర్, శ్రీరాంనగర్, వెంకటాపూర్, కేతిరెడ్డిపల్లి, నక్కలపల్లి, ఎత్‌బార్‌పల్లి, తోలుకట్ట, అప్పారెడ్డిగూడ, కనకమామిడి, సురంగల్ బాకారం, నాగిరెడ్డిగూడ, అజీజ్‌నగర్, చిలుకూరు, అప్పోజీగూడ, చందానగర్, పెద్దమంగళారం, రెడ్డిపల్లి, మోత్కుపల్లి, చిన్నమంగళారం, మేడిపల్లి తదితర గ్రామాల్లో వరి సాగుకోసం రైతులు ఇప్పటికే నార్లు పోశారు. కొన్ని చోట్లు కరిగెట్లు కూడా సిద్ధం చేశారు. త్వరలో నాట్లు నాటేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. భూగర్భ జలాలు పెరగడంతోనే రైతులు వరిసాగుకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు.

బోరుబావుల్లో నీళ్లు పెరిగాయి



ఈ సారి వర్షాలు బాగా పడటంతో బోర్లో నీళ్ల వచ్చాయి. వరి నాటు వేసేందుకు నారుమడి సిద్ధం చేసి నారు పోశాను. ఇప్పుడు కరిగెట్లు చేస్తున్నా. పదిహేను రోజుల్లో వరినాటు వేసేందుకు వస్తుంది. భూగర్భ జలాలు నిండుగా ఉండడంతో చాలా మంది రైతులు వరి నాట్లు వేస్తున్నారు.

– వక్లారి శ్రీనివాస్, రైతు, అప్పారెడ్డిగూడ

వారం రోజుల లోపే నార్లు పోసుకోవాలి



యాసంగిలో వరి సాగు చేసే రైతులు ఇంకా వారం రోజుల లోపే నార్లు పోసుకోవాలి. ఆలస్యంగా నార్లు పోస్తే దిగుబడి తగ్గే అవకాశం ఉంటుంది. మండలంలో ఈ సారి చాలా మంది రైతులు వరినార్లు వేసేందుకు సిద్ధమయ్యారు. నీటికి ఇబ్బంది లేక పోవడంతో వరికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. సుమారు 3 వేల ఎకరాల వరకు వరి సాగు అవుతుందని అంచనా వేస్తున్నాం.

– రాగమ్మ, మండల వ్యవసాయాధికారి, మొయినాబాద్

31 వరకు ఉచిత వైద్య చికిత్సలు

చేవెళ్ల: మండలకేంద్రంలో ఉన్న పట్నం మహేందర్‌రెడ్డి జనరల్ ఆస్పత్రిలో ప్రజలకు సంక్రాంత్రి పండుగ సందర్భంగా అన్ని రకాల వైద్యసేవలు ఆపరేషన్లు, వైద్య పరీక్షలు ఈనెల 31వ తేదీ వరకు పూర్తిగా ఉచితంగా చేయనున్నట్లు ఆస్పత్రి యాజమాన్యం ప్రకటించింది. మండల పరిసర ప్రాంతంలోని ప్రజలు ఈ వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రస్తుతం ఆస్పత్రిలో వైద్యసేవలు ఉచితంగానే అందిస్తున్న పరీక్షలు ఆపరేషన్లకు సాధారణ ఫీజులు ఉండేవని వాటిని కూడా పూర్తిగా తొలగించి పూర్తి ఉచితంగా ఈనెలాఖరు వరకు అందించనున్నట్లు తెలిపారు. చిన్న వైద్యం నుంచి ఆపరేషన్, పెద్ద వైద్యం వరకు అన్ని ఉచితంగా ఆస్పత్రిలో వైద్యసేవలు అందించనున్నట్లు తెలిపారు.

బియ్యం పంపిణీలో కోత సరికాదు

కొందుర్గు: పేదలకు పంపిణీ చేసే రేషన్ బియ్యంలో కిలో తక్కువగా ఇవ్వడం సరికాదని సీపీఎం మండల కార్యదర్శి రాయికంటి గోపాల్ బుధవారం ఒక ప్రకటనలో విమర్శించారు. పేదలకు ఎంతో మేలు చేస్తున్నామని చెప్పే బీజేపీ ప్రభుత్వం పేదలకు ఇచ్చే బియ్యంలో ఒక కిలో తగ్గించడం ఏమిటని ప్రశ్నించారు. వెంటనే బియ్యం తగ్గింపును ఎత్తివేయాలని ఆయన డిమాండ్ చేశారు.

హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోండి



మున్సిపల్ కార్మికులతో ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

కొత్తూరు: ద్విచక్ర వాహనదారులు ప్రయాణ సమయంలో హెల్మెట్లు ధరించి ప్రాణాలను కాపాడుకోవాలని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ సూచించారు. కొత్తూరు మున్సిపాలిటీ కార్యాలయం ఆవరణలో బుధవారం ఆయన మున్సిపల్ కార్మికులకు మున్సిపల్ ఛైర్‌పర్సన్ లావణ్య సహకారంతో సమకూర్చిన హెల్మెట్లను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గతంతో పోల్చితే ఇటీవల కాలంలో హెల్మెట్ల వాడకం చాలా వరకు పెరిగిందన్నారు. హెల్మెట్లు ధరించడం వల్ల ప్రమాదాలు జరిగిన ద్విచక్ర వాహనదారులు ప్రాణాపాయం నుంచి బయటపడొచ్చన్నారు. హెల్మెట్లు ధరించక పోవడంతో తలకు గాయాలై చాలామంది వాహనదారులు మృతి చెందుతున్నట్లు చెప్పారు. ముఖ్యంగా పెద్దలు చిన్నారులకు వాహనాలను ఇవ్వొద్దన్నారు. కార్యక్రమంలో నాయకులు దేవేందర్‌యాదవ్, రవీందర్, శ్రీనివాస్, కమిషనర్ వీరేందర్, రవినాయక్, జనార్దన్‌చారి, ఆంజనేయులుగౌడ్, బాల్‌రాజు, లక్ష్మయ్య, వెంకటేష్, శ్రావణ్, శివకుమార్ పాల్గొన్నారు.

అభివృద్ధిలో సహకార సంఘాల పాత్ర కీలకం

షాద్‌నగర్‌రూరల్: వ్యవసాయం, చేనేత వృత్తి పరమైన రంగాల్లో అభివృద్ధిని సాధించడంలో సహకార సంఘాలు కీలక పాత్రను పోషిస్తాయని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. పట్టణంలోని ఈడెన్ ప్లాజా ఫంక్షన్ హాలులో బుధవారం శ్రీ రామలింగేశ్వర సహకార సమితి షాద్‌నగర్ ఆధ్వర్యంలో సహకార భారతి వ్యవస్థాపక వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ర్యాలీని మున్సిపల్ ఛైర్మన్ కొందూటినరేందర్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడుతూ.. పూర్వ కాలంలో డబ్బులకు ఇబ్బందులు పడేవారని, ప్రస్తుతం సహకార సంఘాల వల్ల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. సంఘాల అభివృద్ధికి ప్రతి ఒక్కరు చేయూతను అందించాలని కోరారు. కార్యక్రమంలో కుమారస్వామి, శ్రీనివాస్, సుమంత్‌కుమార్, ఆంజనేయులు, మల్లేష్ పాల్గొన్నారు.

పాడి రైతుల అభివృద్ధికి విజయ డెయిరీ కృషి

- డెయిరీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శివాల్కర్‌యాదవ్

షాద్‌నగర్‌రూరల్: పాడి పశువుల ఆరోగ్యాన్ని కాపాడుకుంటే పాల దిగుబడి అధికంగా వస్తుందని విజయ డెయిరీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శివాల్కర్ యాదవ్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని నాగులపల్లి గ్రామంలో బుధవారం విజయ డెయిరీ షాద్‌నగర్ మిల్క్‌షెడ్ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అనారోగ్యానికి గురైన పాడి గేదెలు, ఆవులకు పశు వైద్యాధికారిణి డాక్టర్ ప్రసన్న వైద్య పరీక్షలు నిర్వహించి చికిత్సను అందించారు. ఈ కార్యక్రమానికి శివాల్కర్‌యాదవ్ హాజరై మాట్లాడుతూ.. పాడి పశువులపై ఆధారపడి జీవిస్తున్న రైతుల అభివృద్ధికి విజయ డెయిరీ ఎంతో కృషి చేస్తుందన్నారు. పాడి పశువుల ఆరోగ్యం పట్ల రైతులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పశువులకు ప్రతి మూడు నెలలకు ఒకసారి తప్పనిసరిగా నట్టల నివారణ మందులను వాడాలని చెప్పారు. విజయ డెయిరీకి పాలు పోస్తున్న రైతుల ఇళ్లల్లో వివాహం జరిగితే రూ.5వేలు, పాడి రైతుల పిల్లలు చదువులో ఉత్తమ ర్యాంకులను సాధిస్తే ప్రోత్సాహకంగా రూ.10వేలు అందజేయడం జరుగుతుందన్నారు. రాష్ట్ర డెయిరీ డెవలప్‌మెంట్ ఫెడరేషన్ ఛైర్మన్ భరత్ కుమార్‌గుప్త, మేనేజింగ్ డైరెక్టర్ ఆధార్‌సిన్హా ఆదేశాల మేరకు ఈ ఉచిత పశు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అనంతరం ప్రణయ్ తెరపిటిక్స్ కంపెనీ సహకారంతో మినరల్ మిక్చర్, కాల్షియం మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాగులపల్లి సర్పంచ్ నర్సింలు, ఉపసర్పంచ్ లత, విజయ డెయిరీ మేనేజర్ సురేష్, మిల్క్ సెంటర్ ప్రెసిడెంట్ అశోక్‌రెడ్డి, గోపాలమిత్ర లక్ష్మయ్య, పాడి రైతులు వెంకట్‌రెడ్డి, రాములుగౌడ్, ప్రణయ్ తెరపిటిక్స్ కంపెనీ ప్రతినిధి నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పశువుల యాజమానులకు మందులు పంపిణీ చేస్తున్న ప్రతినిధులు

ప్రజావ్యతిరేక ప్రభుత్వాలను గద్దెదించాలి

టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి శంకర్

కేశంపేట: ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను గద్దె దించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వీరేష్ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఈనెల 26న ప్రారంభం కానున్న హాత్ సే హాత్ జోడో అభియాన్‌పై కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తుంగలో తొక్కాయని ఆరోపించారు. కుటుంబ పాలనకు ప్రజలు చరమగీతం పాడేందుకు సిద్ధంగా ఉన్నారని ఆయన అన్నారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి నిర్వహించ తలపెట్టిన హాత్‌సేహాత్ జోడో అభియాన్‌లో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. గ్రామాల్లో కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో షాద్‌నగర్ మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మెన్ యాదయ్య యాదవ్ పాల్గొన్నారు.

దేశాన్ని దోచుకుంటున్నాయి..

కొత్తూరు: బీజేపీ, భారత రాష్ట్ర సమితిలు అంతర్గతంగా కుమ్మక్కై, దేశ సంపదను దోచుకుంటున్నాయని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ ఆరోపించారు. ఈ నెల 26 నుంచి ప్రారంభం కానున్న హాత్ సే హాత్ జోడో సన్నాహక కార్యక్రమం కొత్తూరు మండలకేంద్రంలో బుధవారం మండల పార్టీ అధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందులో భాగంగా శంకర్ మాట్లాడుతూ.. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు అప్పనంగా ప్రభుత్వ ఆస్తులను అప్పగిస్తుందన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం తమ కుటుంబం కోసం రాష్ట్ర సంపదను ఆయా మార్గాల్లో దారి మళ్లిస్తుందన్నాదని ఆరోపించారు. నియోజకవర్గంలో స్వార్థపరులు, రౌడీలు, గుండాలు మాత్రమే పార్టీ మారుతున్నారని, అసలైన నాయకులు ఎప్పటికీ కాంగ్రెస్ పార్టీలోనే ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్, దయానంద్ గుప్త, రాందాస్‌నాయక్, దేవేందర్, రవికుమార్‌గుప్త, కృష్ణ, అశోక్, ఆంజనేయులు, నర్సింహ్మ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకుడు శంకర్

ఈకేవైసీ తప్పనిసరి

మండల వ్యవసాయ అధికారి నిషాంత్‌కుమార్

షాద్‌నగర్: పీఎం కిసాన్ పథకం కోసం అర్హులైన రైతులు ఈకేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి నిషాంత్‌కుమార్ కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. రైతులకు పెట్టుబడి సహాయం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ యోజన పథకం ప్రవేశపెట్టిందన్నారు. ఈ పథకంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం రైతులకు సంవత్సరానికి ఆరువేల ఆర్థిక సహాయం బ్యాంకు ఖాతాలో జమ చేస్తుందని చెప్పారు. ఫరూఖ్‌నగర్ మండలంలో పీఎం కిసాన్ యోజన పథకానికి 10961 మంది అర్హులైన రైతులు ఉన్నట్లు తెలిపారు. ఇందులో ఇప్పటివరకు 8284 మంది రైతులు మాత్రమే పీఎం కిసాన్ ఈకేవైసీ చేయించుకున్నట్లు తెలిపారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

శంకర్‌పల్లి: శంకర్‌పల్లి ఆదర్శ పాఠశాల ఆవరణలో బుధవారం యూటీఎఫ్ మండల శాఖ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి యూటీఎఫ్ రాజీలేని పోరాట చేస్తుందని చెప్పారు. ప్రభుత్వం ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులను వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీయూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మునీర్‌పాషా, మండల విద్యాధికారి అక్బర్, శంకర్‌పల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాజశేఖర్‌రెడ్డి, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ ఉమామహేశ్వర్‌రావు, ప్రధానోపాధ్యాయుడు సుధాకర్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

కేశంపేట: మండల పరిధిలోని సంగెం గ్రామంలో బూర్గుల వెంకటయ్య ఆకస్మికంగా మృతి చెందాడు. మృతుడిది నిరుపేద కుటుంబ కావడంతో అంత్యక్రియల నిమిత్తం కుటుంబ సభ్యులకు ప్రసూన్ కన్‌స్ట్రక్షన్ నుంచి యెన్నం గోపాల్‌రెడ్డి పదివేలు, ఎంపీపీ రవీందర్ యాదవ్, ఐదువేలు, స్త్రీశిశు సంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా ఛైర్‌పర్సన్ తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి ఐదు వేల చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రేణుక, యాదగిరి, జంగయ్య, షకిల్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అండగా ప్రజాప్రతినిధులు

చేవెళ్ల: మండలం కేంద్రంలో జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్‌లో ప్రతిభ కనబరుస్తున్న టీంలకు ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు ముందుకు వచ్చి నజరానాలు, స్పోర్ట్స్ కిట్లను అందజేస్తున్నారు. మండల కేంద్రంలోని కేవీఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో జరుగుతున్న పైండ్ల గోపాల్‌రెడ్డి క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా బుధవారం మండలంలోని ఆయా గ్రామాల క్రీడాకారులకు వారి గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు ముందుకు వచ్చి కిట్లను ప్రకటించి అందజేశారు. ఈ టోర్నమెంట్‌లో చేవెళ్ల మండలంలోని కేసారం జట్టుకు ఆ గ్రామ సర్పంచ్ కె. రమేశ్‌గౌడ్ ముందుకు వచ్చి నగదు బహుమతిని అందజేశారు. మండలంలోని మల్కాపూర్ గ్రామానికి చెందిన ఎంపీటీసీ బి.రవీందర్‌రెడ్డి ఆ గ్రామానికి చెందిన జట్టు సభ్యులకు స్పోర్ట్స్ డ్రెస్‌ను, క్రికెట్ కిట్టును అందజేశారు. క్రీడాకారులు బాగా ఆడి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. మండలంలోని రావులపల్లి గ్రామానికి చెందిన క్రికెట్ జట్టుకు ఆ గ్రామానికి చెందిన ముడిమ్యాల పీఏసీఎస్ డైరెక్టర్ కేసారం నరేందర్ స్పోర్ట్స్ డ్రెస్‌లు అందించడంతో పాటు బుధవారం ఆడిన పోటీలో గెలుపొందినందుకు రూ.2500ల నగదులను అందించి ప్రోత్సహించారు.



జట్టుకు స్పోర్ట్స్ డ్రెస్‌ను అందజేస్తున్న నరేందర్

ఘనంగా సంక్రాంతి ముగ్గుల పోటీలు

షాబాద్: మండల కేంద్రంలో ముగ్గుల పోటీలు నిర్వహించినట్లు లయన్స్‌క్లబ్ హైదరాబాద్ హోప్ ఫౌండేషన్ ఛైర్మన్ కొండ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని బాలుర ఉన్నత పాఠశాలలో లయన్స్‌క్లబ్ హైదరాబాద్ హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రంగోళి పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి నగదు బహుమతులు అందజేశారు. ఈ సంద్భరంగా ఆయన మట్లాడుతూ.. గ్రామాల్లో పండుగలను ప్రజలు సుఖసంతోషాలతో జరుపుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సుబ్రమణ్వేశ్వరి, గ్రామస్తులు రవీందర్, మల్లిఖార్జున్, ప్రదీప్, షఫీ పాఠశాల ఉపాధ్యాయులు డేవిడ్‌రెడ్డి, బాలకృష్ణ, ఆంజనేయులు, రియాజ్, రాంచంద్రయ్య తదితరులున్నారు.



నగదు బహుమతి అందజేస్తున్న విజయ్‌కుమార్

నిరాశ్రయుల కేంద్రం ఏర్పాటుకు దరఖాస్తులు

షాద్‌నగర్: పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ, మెప్మా, షాద్‌నగర్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్వహించే నిరాశ్రయుల కేంద్రం నిర్వహణకు ఆసక్తి గల వారు దరఖాస్తులు చేసుకోవాలని కమిషనర్ వెంకన్న బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. నిరాశ్రయుల కేంద్రం నిర్వహించడానికి స్వచ్ఛంద సంస్థలు, పట్టణ సమాఖ్యలు, నెహ్రూయువ కేంద్రాలు, సంక్షేమ సంబంధ సంస్థల వారు ఈనెల 21తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఆసక్తి గల వారు మున్సిపాలిటీలోని మెప్మా విభాగంలో పని చేస్తున్న జూనియర్ అసిస్టెంట్ యాదమ్మను సంప్రదించాలని కమిషనర్ తెలిపారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

స్త్రీశిశు సంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా ఛైర్‌పర్సన్ విశాల

కేశంపేట: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను కార్యకర్తలు క్షేత్రస్థాయిలో ఇంటింటికి తీసుకెళ్లాలని స్త్రీశిశు సంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా ఛైర్‌పర్సన్ తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ గ్రామంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి అధ్యక్షతన బుధవారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విశాల మాట్లాడుతూ..రాష్ట్రంలో సబ్బండవర్గాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న పథకాలు దేశంలో చాలా రాష్ట్రాలు అమలు చేస్తున్నాయని ఆమె అన్నారు. గ్రామాల్లో కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న పథకాలను వివరించాలని ఆమె కోరారు. ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ గ్రామాల అభివృద్ధికి అనేక నిధులను తీసుకువచ్చి అభివృద్ధి చేస్తున్నాడని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి, షాద్‌నగర్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ ఛైర్మన్ లక్ష్మీనారాయణగౌడ్, మండల కోఆప్షన్ సభ్యులు జమాల్‌ఖాన్, శ్రావణ్‌రెడ్డి, నర్సింలు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న విశాల

దర్గా అభివృద్ధికి నా వంతు కృషి చేస్తా

జెడ్పీటీసీ అవినాశ్‌రెడ్డి

షాబాద్: షాబాద్ పహిల్వాన్‌షావలి దర్గా అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పహిల్వాన్ షావలి దర్గాలో మతపెద్దలతో కలిసి ప్రత్యేక పార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దర్గాలో కులమతాలకు అతీతంగా అందరూ కలిసి మెలిసి ఉండాలన్నారు. కేసీఆర్ ప్రభుత్వం మైనార్టీల అభివృద్ధికి ఎంతో ప్రాధాన్యత ఇస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ముస్లిం సోదరులు సత్తార్, అజీమ్, మసూద్, తాజ్, ఆరీఫ్, ముఖ్రంఖాన్, సలీం, షాఫీ, షమీమ్, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ నక్క శ్రీనివాస్‌గౌడ్, మాజీ సర్పంచ్ వెంకట్‌యాదవ్, సీనియర్ నాయకులు రాజేందర్‌గౌడ్ తదితరులున్నారు.



దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న అవినాశ్‌రెడ్డి